క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు మూడు రోజులు అంతరాయం

నెహ్రూనగర్: లీకుల మరమ్మతుల పనుల వల్ల నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం, శనివారం, ఆదివారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ నుంచి హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు తాగునీటి సరఫరా జరిగే 800 ఎంఎం డయా పైప్‌లైన్‌పై సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడిన లీకులను సరి చేసే పనుల్ని శుక్రవారం మధ్యాహ్నం నుంచి చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని పేర్కొన్నారు. పనుల వల్ల లక్ష్మీపురం, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డ్, కోర్ట్ కాంపౌండ్, కేవీపీ కాలనీ, వికాస్ నగర్, శ్యామలా నగర్, హనుమయ్య నగర్, నెహ్రూనగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాల బీడు, వసంతరాయపురం, శారదా కాలనీ రిజర్వాయర్ల పరిధిలో శుక్రవారం సాయంత్రం, శనివారం రోజు పూర్తిగా నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుంచి యథావిధిగా సరఫరా చేస్తామని తెలిపారు. నగర ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్‌కు తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్: నగరంలోని ఈస్ట్ విభాగం తహసీల్దార్ నగేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం కర్నూల్‌లో వివాహానికి ఆయన హాజరయ్యారు. వివాహం అనంతరం రాత్రి కారులో గుంటూరు బయలుదేరారు. రూరల్ మండలంలోని చిన్నపలకలూరు గ్రామ శివారుల్లో తెల్లవారుజామున డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నగేష్‌తోపాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇద్దరినీ స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఇద్దరి పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తహసీల్దార్ నగేష్‌ను డీఆర్ఓ, ఆర్డీవో, రెవెన్యూ సిబ్బంది పరామర్శించారు.

విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రూ.12.50 లక్షల అపరాధ రుసుం వసూలు

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్ పర్యవేక్షక ఇంజనీర్ ఎం.అల్ఫోన్స్, జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అడవితక్కెళ్లపాడు, గోర్లవారిపాలెం, నల్లపాడు, మల్లవరం, తురకపాలెం, వీఆర్ కాలనీ తదితర ఏరియాలలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసబాబు తెలిపారు. 54 మంది అధికారులు, 162 మంది సిబ్బంది, 54 బృందాలుగా ఏర్పడి 3,851 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 240 మందికి రూ.11.92 లక్షలు, మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.52వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ. 6వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. దాడుల్లో డీఈఈలు ఎస్.మల్లికార్జునప్రసాద్, బి.రాజమోహన్, ఏఈలు సతీష్, శివశంకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతూ జారి యువకుడి దుర్మరణం

లక్ష్మీపురం: ఆర్టీసీ బస్సు వెనుక టైరు కింద పడి యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రేపల్లె ఖాజీపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు అఖిల్ (22) గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అప్రెంటిస్ చేస్తుంటాడు. రేపల్లె వెళ్ళేందుకు గుంటూరు బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 28 వద్ద బస్సు ఎక్కేందుకు వస్తున్న క్రమంలో కాలు జారీ వెనుక టైరు కింద పడ్డాడు. టైరు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.

రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలకు స్పందన

కొరిటెపాడు(గుంటూరు): జేకేసీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయిలో సెల్‌ఫోన్ వల్ల సమాజానికి లాభమా? నష్టమా? అనే సంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. 20 కళాశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లోని ఏపీఆర్‌డీసీ కళాశాలకు చెందిన జి.వంశీ, ద్వితీయ బహుమతిని విజయవాడలోని సిద్ధార్థ కళాశాలకు చెందిన బి.దుర్గా భవాని, తృతీయ బహుమతిని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి చెందిన బి.కావ్య నాగిని గెలుచుకున్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ శరణు రామకృష్ణప్రసాద్ గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేశారు.

భౌభౌలతో వాకర్స్ బెంబేలు

ఎన్టీఆర్ స్టేడియంలో వీధి కుక్కల బెడద

- భయాందోళనలో వాకర్స్
- చోద్యం చూస్తున్న స్టేడియం సిబ్బంది, అధికారులు



స్టేడియంలో సందర్శకుల పక్కనే ఉన్న వీధి కుక్కలు



లక్ష్మీపురం: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ట్రాక్‌లో వాకింగ్, రన్నింగ్ చేసే వారు భీతిల్లుతున్నారు. కుక్కల బెడదతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అంటూ బిక్కు బిక్కుమంటూ వాకింగ్ చేస్తున్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతి రోజు వందల సంఖ్యలో నగరవాసులు వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. ప్రధానంగా డాక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు, విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్స్, వృద్ధులు, చిన్నారులు వాకింగ్ చేసి కొంత సేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలక్షేపం చేస్తుంటారు. సాయంత్రం చిన్నారులు క్రీడల్లో శిక్షణ కోసం వస్తుంటారు.

వాకర్స్‌పై దాడి

స్టేడియం ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా కుక్కలు ఎక్కువై పోయాయి. వాకింగ్, రన్నింగ్ చేసే సయమంలో మీదకు రావడంతో పాటు వాకర్స్‌పై దాడి చేస్తున్నాయి. వాకింగ్ ట్రాక్ చుట్టూ కూడా పదుల సంఖ్యలో ఉంటున్నాయి. వాకర్స్ మధ్యలోకి వచ్చి అరవడంతో భయాందోళనకు గురవుతున్నారు. సాయంత్రం చిన్నారులు ఆడుకుంటున్నప్పుడు వారి వెంట పడుతున్నాయి. దీని వల్ల స్టేడియానికి రావాలంటే భయమేస్తోందని పలువురు వాపోతున్నారు. వ్యాయామ పరికరాల వద్ద కూడా కుక్కలు సంచరించడంతో భయం భయంతో చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేడియంలో లాంగ్ జంప్ రింగ్‌లో ఇసుక లేకపోవడంతో పాటు అందులో కుక్కలు ఉండటంతో లాంగ్ జంప్ శిక్షణ కోసం వచ్చే వారు కరువయ్యారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.



వాకింగ్ ట్రాక్‌లో..

ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించుకుంటున్న నగర కమిషనర్

నెహ్రూనగర్: ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సిటీ డయాబెటిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జీఎంసీ కార్మికులు, ఉద్యోగులకు ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ పరీక్షల క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులు నిరంతరం పారిశుద్ధ్య పనుల్లో ఉండడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తుంటాయని తెలిపారు. కార్మికులు ప్రత్యేకంగా వైద్య పరీక్షలకు వెళ్లడానికి సిద్ధపడడం లేదని, వారిని దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిటీ డయాబెటిస్ ఫెడరేషన్‌కు జీఎంసీ తరఫున అభినందనలు తెలిపారు. త్వరలో ప్రతి నెలా క్యాంప్‌లు జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సిటీ డయాబెటిస్ ఫెడరేషన్ వైద్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ కృష్ణమూర్తి, జీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి బాబు, మేనేజర్ బాలాజీ బాషా, సన్ ఫార్మా మేనేజర్ అజ్మత్ పాల్గొనారు.

మధుమేహంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ టి.సేవకుమార్

గుంటూరు మెడికల్: మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్.హెచ్.ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.సేవకుమార్ సూచించారు. నవంబర్ 14న ప్రపంచ మధుమేహ నిరోధక దినోత్సవం ఎస్.హెచ్.ఓ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో గురువారం 'మధుమేహం- లక్షణాలు- నిర్ధారణ పరీక్షలు -చికిత్స విధానాలు- నిరోధక ముందు జాగ్రత్తలు' అనే అంశంపై శాస్త్రీయ అవగాహన సభ నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ సేవకుమార్ మాట్లాడుతూ శారీరక వ్యాయామం లేకపోవడం, ఆహారంలో కల్తీ, ఆహారపు అలవాట్లు, జీవన సరళిలో వచ్చిన మార్పులు, మానసిక ఒత్తిడి, ఆందోళనలు మధుమేహానికి కారణమవుతున్నాయని తెలిపారు. తొలిదశలో గుర్తిస్తే వ్యాయామం, ఆహారం ద్వారానే చాలాకాలం అదుపులో పెట్టుకోవచ్చని తెలిపారు. మధుమేహ నిరోధం మన చేతుల్లోనే ఉందని సూచించారు. టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మధుమేహం నిరోధక దినోత్సవ ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. నిరోధక చర్యలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య, ఎస్.హెచ్.ఓ మేనేజర్ పి.నిర్మలారాణి, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్ఓబీ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణం వల్ల నష్టం కలిగే ప్రతి ఒక్కరికీ తగిన నష్ట పరిహారం అందిస్తామని, నిర్మాణానికి సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ప్రైవేట్ భవన యజమానులు, ప్రభుత్వ శాఖల భవనాల అధికారులతో వేరువేరుగా కమిషనర్, ఆర్ అండ్ బీ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి స్థానంలో 71 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల బ్రిడ్జి, డివైడర్, ఫుట్‌పాత్‌లతో ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని తెలిపారు. హిందూ కాలేజీ జంక్షన్ నుంచి లాడ్జి సెంటర్ వరకు 1.6 కిలోమీటర్ల పొడవులో ప్రస్తుతం 85 అడుగుల నుంచి 105 అడుగుల వరకు ఉన్న రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులకు విస్తరణ చేయాలని తెలిపారు. ఇందులో 19 ప్రభుత్వ, 99 ప్రైవేట్, 14 మిషనరీల, రెండు ప్రార్థన మందిరాలు ప్రభావితం అవుతాయని తెలిపారు. ఆర్ఓబీ నిర్మాణం వలన నష్టపోతున్న భవనాలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్థలాలకు టీడీఆర్‌లు, భవనాలకు నష్ట పరిహారం ఇస్తామని తెలిపారు. తొలుత ఆర్ఓబీ నిర్మాణంపై సాంకేతిక అంశాలను ఆర్ అండ్ బీ డీఈఈ, రోడ్ విస్తరణ అంశాలను జీఎంసీ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం భవన యజమానులు ఆర్ఓబి నిర్మాణంపై చేసిన సూచనలు, ప్రతిపాదనలు, అభ్యంతరాలను తీసుకొని, వాటిని రికార్డ్ చేసి, తదుపరి ఉన్నతస్థాయి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

కార్మికుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలక సంస్థలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా రెండో గురువారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో కార్మికుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు, గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు కమిషనర్ ను కోరారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, విభాగ సూపరిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సుగాలి కాలనీ, వికాస్ నగర్ 1వ లైన్‌లో నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్ల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు నిర్దేశిత గడువుకు ముందు డ్యామేజీ అయితే సదరు కాంట్రాక్టర్, పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఆయన వెంట కార్పొరేటర్ కె.కోటేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి



విద్యార్థులతో ఎంఈవో జ్యోతికిరణ్, రమేష్, నగేష్‌కుమార్, ఉపాధ్యాయులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించిన ఎండీ మున్నా, కనకదుర్గ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని గుంటూరు తూర్పు ఎంఈవో–2 కె. జ్యోతికిరణ్ సూచించారు. వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో జ్యోతికిరణ్ మాట్లాడుతూ చిన్నారులు నెహ్రూ జీవితం నుంచి ఎన్నో గొప్ప విషయాలను నేర్చుకోవచ్చని సూచించారు. తద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు. వాసవీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు నగేష్ కుమార్ మాట్లాడుతూ క్లబ్ తరఫున పాఠశాలలో పలు మౌలిక వసతులను సమకూర్చినట్లు తెలిపారు. విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో ముందుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీడలతో పాటు చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెరికల రమేష్, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, తద్వారా అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్నా పేర్కొన్నారు. సంగడిగుంటలోని హైస్కూల్లో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మున్నా మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా ప్రతి విద్యార్థి చాచా నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. భావి భారత పౌరులుగా ఎదిగేందుకు కృషి, దీక్ష, పట్టుదలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రశ్నించే తత్వాన్ని, సృజనాత్మకను పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం చౌత్రా సెంటర్‌లోని పాఠశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ఘనత



వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ యశస్వి రమణ. పక్కన చికిత్స పొందిన రోగులు

గుంటూరు మెడికల్: రక్తహీనతతో బాధపడుతున్న మహిళ, క్లోమ గ్రంధి దెబ్బతిన్న రోగికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు సకాలంలో స్పందించి శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు కాపాడారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్‌బాషా, డాక్టర్ శివరామకృష్ణలను గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ గురువారం అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ కవిత మాట్లాడుతూ చేబ్రోలు మండలం శ్రీరంగపురానికి చెందిన 47 సంవత్సరాల వై.ఎస్.ఆర్. మల్లీశ్వరి తరచూ రక్త హీనతతో బాధపడుతున్నట్లు చెప్పారు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అక్టోబరు 26న తమ వైద్య విభాగానికి చికిత్స కోసం వచ్చిందన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో సదరు మహిళను అడ్మిట్ చేసుకుని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్‌బాషా, డాక్టర్ శివరామకృష్ణలు వైద్య పరీక్షలు చేశారని వివరించారు. ఈనెల 7న ఎండోస్కోపీ పరికరం ద్వారా రోగికి చిన్న పేగులో ఇలియమ్ అనే చోట చిన్న గడ్డ నుంచి రక్తం వెళ్తుందని నిర్ధారించారన్నారు. సుమారు రూ. లక్ష ఖర్చు అయ్యే వైద్య చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి ఉచితంగా చేసినట్లు తెలిపారు. మహిళ పూర్తిగా కోలుకోవడంతో ఈ నెల 12న డిశ్చార్జ్ చేశామని చెప్పారు.

- గుంటూరులోని ప్రకాష్ నగర్‌కి చెందిన 38 సంవత్సరాల వై. వెంకటేశ్వర్లు మూడు నెలల క్రితం ప్రమాదంలో గాయపడినట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లోని ఎమర్జెన్సీ వార్డులో చికిత్స కోసం రాగా, చికిత్స చేసిన వైద్యులు ప్యాంక్రియాటిక్ క్లోమ గ్రంథి దెబ్బతిందని నిర్ధారించారని కవిత తెలిపారు. సర్జరీ చేసిన వైద్యులు సగం గ్రంథి తీసేశారని, చికిత్స అనంతరం రోగికి ఒక నెల పాటు క్లోమ గ్రంథి నుంచి లీక్ అవ్వడం ప్రారంభమైందని చెప్పారు. ఈ నెల 2న మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రాగా క్లోమ గ్రంధి నాళంలో స్టెంట్ వేయాలని నిర్ధారించామని తెలిపారు. ఈఆర్‌సీపీ ద్వారా శస్త్రచికిత్స విజయవంతం చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. రూ. లక్ష ఖర్చు అయ్యే వైద్యాన్ని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి ఉచితంగా చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 12న డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ అనిల్, డాక్టర్ నవీన్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, పోలయ్య పాల్గొన్నారని డాక్టర్ కవిత వెల్లడించారు.

ఆసుపత్రిలో పచ్చదనం పెంపునకు కృషి

గుంటూరు జీజీహెచ్‌లో పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని గురువారం సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆయన, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ చిన్నం సుధారాణి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, మానసిక వ్యాధుల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు వర్సిటీ వీసీ అభినందన

ఏఎన్‌యూ: థాయిలాండ్, బ్యాంకాక్‌లో యురేషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈయూ) షినవత్రా విశ్వవిద్యాలయం, పాతుమ్ థాని, థాయిలాండ్, రిసెర్చ్ కల్చర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 8, 9 తేదీలలో జరిగిన 'పరిశోధన, ఆవిష్కరణలపై' అంతర్జాతీయ సమావేశంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్‌రావు అవార్డు గ్రహీతలను గురువారం సత్కరించారు. ఎకనామిక్స్ విభాగధిపతి, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కడిమి మధుబాబు, కామర్స్ అండ్ ఎకానమీ సెషన్‌లో ''స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్‌ఫర్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా'' అంశంపై సమర్పించిన పత్రం ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికైందని తెలిపారు.

వర్సిటీ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగధిపతి ఆచార్య బి.నాగరాజు 'ఎక్స్‌ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కే స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే' అంశంపై సమర్పించిన పత్రం బెస్ట్ రీసెర్చ్ పేపర్‌గా ఎంపికై ందని చెప్పారు. ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజులను వర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ప్రశాంత జీవనానికి పుస్తక పఠనం దోహదం



పుస్తకాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నగరంపాలెం: మనిషి ప్రశాంత జీవితానికి పుస్తక పఠనం దోహదపడుతుందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ 24వ పుస్తక మహోత్సవంలో భాగంగా లాడ్జి కూడలి ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను కమిషనర్ ప్రారంభించారు. తొలుత పుస్తక ప్రదర్శనను తిలకించి, పలు పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుమారు నలభై మంది పబ్లిషర్స్ ప్రచురించిన అనేక రకాల పుస్తకాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు వేలకొద్ది పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అభ్యుదయ రచయిత సంఘం(అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, విశాలాంధ్ర బుక్ హౌస్ జిల్లా మేనేజర్ బి.శ్రీనివాసులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు మానసిక వికాసానికి ఉపయోగపడే పుస్తకాలు ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జీఎం గూడవల్లి నాగేశ్వరరావు, సీనియర్ వైద్యురాలు చంద్ర రాధికారాణి, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరంలో జిల్లా ఎస్పీ సుడిగాలి పర్యటన



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

లక్ష్మీపురం: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం అర్ధరాత్రి నగరంలో సుడిగాలి పర్యటన నగరంపాలెం, అరండల్ పేట, పట్టాభిపురం, లాలాపేట పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. సెంట్రీ కానిస్టేబుళ్ల పనితీరును, వారు బాధితులతో ప్రవర్తించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. తమ వారు తప్పిపోయారని అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో విన్నవించుకోవడానికి వచ్చిన మహిళతో స్వయంగా మాట్లాడారు. త్వరితగతిన వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. లాక్‌అప్‌లను పరిశీలించారు. అనవసరంగా ఎవరిని కస్టడీలో ఉంచరాదని ఆదేశించారు. అనంతరం బ్రాడీపేట 4వ లైనులో రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లాలాపేట హిమని సెంటర్ వద్ద తెరచి వున్న షాపులను పరిశీలించారు. పోలీస్ వారు అనుమతించిన సమయంలోపు మూసివేయాలని, లేదంటే చర్యలు తీసుకోవలసి వస్తుందని దుకాణదారులను హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతరావు, లాలాపేట సీఐ శివప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులే దేశానికి తరగని సంపద



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులే దేశానికి తరగని సంపద అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో గురువారం బాలోత్సవ్–7ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలంటే ఎంతో ప్రేమగా మెలగిన చాచా నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల దేశం గర్వించే పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సుమేధ బాలోత్సవ్–7 పేరుతో నెల రోజుల నుంచి విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలల దినోత్సవ రోజున ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు మూడువేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ నాజియా బేగం, అయ్యప్ప, హరిత హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ శిరీష, ఆచార్య వీర రాఘవరావు పాల్గొన్నారు.